

# గొలుసుదానం

నార్ల వెంకటేశ్వరరావు

'నాన్నా! వొచ్చేనెల నాకు చంద్రహారం చేయించి పెడతావా?' అని కొత్త పెళ్ళికూతురు శ్యామల వాళ్ళ నాన్నని గారాబంగా అడిగింది

"అలాగే! తల్లీ!" అని కుటుంబరావు భరోసాగా అన్నాడు.

గొలుసు మెడలో పడ్డట్టే సంబరపడి, ఈ సంతోషవార్తను అమ్మకు అందించడానికి బిరబిర లోపలికివెళ్ళింది శ్యామల.

కుమార్తె పెళ్ళికైన అప్పుల ఆలోచనలో తిరిగి పడిపోయాడు, కుటుంబరావు

వంటింటిలోనుంచి ముసిముసినవ్వులు నవ్వుకుంటూ వచ్చి, "ఏమండీ! వచ్చేనెల అమ్మాయికి చంద్రహారం చేయించి పెడతామన్నారటగా!" అని శేషమాంబభర్తని అడిగింది.

"ముందు ఎప్పటి మాటకో ఇప్పుడే మొండిచెయ్యి చూపించడం దేనికని ఉత్తినే అన్నాలే" అంటూ కుటుంబరావు చప్పరించేసాడు.

"ఉత్తినే పాపం దాన్ని ఆశపెట్టడం తప్పుకాదండీ!" అని శేషమాంబ గునిసింది కూతురు మంచి చీర కట్టుకున్నా, మంచి నగ పెట్టుకున్నా, అది తమ సింగారమేననీ, తమ భాగ్యమేననీ మురిసి

పోయే తల్లులలో శేషమాంబనే ముందు చెప్పాలి.

"ఆః పోదూః ఇప్పుడు సాధ్యపడదమ్మా అని వొచ్చే నెల చెప్పగూడదా ఏమిటిః ఊహుంః వీలుపడదని ఇప్పుడే దాన్ని చిన్నబుచ్చాలా?'' అని కుటుంబరావు విసుక్కున్నాడు

"ఆ పసిదానిదగ్గిర కూడా మీలౌకికం పోనిచ్చారుకారు " అని చికాకుపడుతూ శేషమాంబ బిరబిర వెళ్లిపోయింది

రాత్రి బడలిక తీరడానికి మధ్యాహ్నం పూట కాసేపు కన్నుమూసి, అప్పుడే నిద్రలేచిన ప్రసాదరావు గదిలోనుంచి ఈ సంభాషణ ఆలకించాడు

తర్వాత ఒక అరగంటకు ఫలహారం చేస్తూ, మామగారితో 'వచ్చేనెల నాకొక రిస్ట్‌వాచి కొనిపెడతారా?' అని అడిగాడు

'అలాగేః' అని కుటుంబరావు నిస్సంకోచంగా జవాబు చెప్పాడు.

ప్రసాదరావు పెదవులపై చిరునవ్వు నాట్యం చేసింది. అతని కళ్ళు కాంతులీనాయి

భావిని గురించి 'అలాగేః' అన్నంత మాత్రాన తను ఇంత ఆనందాన్ని యివ్వగలిగినప్పుడు ఆ మాట అనడానికి ఎప్పుడైనా సరే తానిక సంకోచించ నక్కర లేదని ఆ క్షణంలో కుటుంబరావు తీర్మానించుకున్నాడు.

రాత్రి భోజనాల వేళకు ప్రసాదరావు బజారునుంచి వచ్చి 'ఏమండీ! ఇది అందంగా వున్నదా?' అంటూ ఒక రిస్ట్‌వాచీ చూపించాడు

కొంచెం వెలవెలబోతూ, "అందంగానే ఉంది. కాని, ఎవరి దేమిటిః" అని కుటుంబరావు అడిగాడు.

"నాదేనండీ! మీరు కొనిపెడతామన్నారుకదూ? అందుకని ఈ ఊళ్లో నా స్నేహితుడి షాప్‌నుంచే పట్టుకొచ్చాః" అంటూ ప్రసాదరావు పెల్లుబుకివస్తున్న నవ్వును కష్టంమీద ఆపుకున్నాడు.

'నేనన్నది వచ్చే నెలలో...' అంటూ ఉడుకుబోతుతనంతో కుటుంబరావు ఏమో అనబోయాడు.

"ఫరవాలేదు లెండి, వచ్చే నెలవరకు మావాడు డబ్బుకోసం ఆగుతానన్నాడు" అని అతని మాటను తుంచివేశాడు ప్రసాదరావు

అల్లుడు కొట్టిన దెబ్బకు మర్నాటివరకు మళ్ళీ కుటుంబరావు నోటివెంట మాట పెగల్లేదు.

